క్లుప్తంగా

నేడు ఎన్నికల ప్రచారం

కోడిపర్రు(వేమూరు) వేమూరు మండలం కోడిపర్రులో ఆది వారం సాయంత్రం 4 గంటలకు ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షులు బొల్లిముంత ఏడుకొండలు తెలిపారు. ప్రచార కార్యక్రమంలో మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

9న ఉగాది వేడుకలు

రేపల్లె రూరల్‌: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకని ఈ నెల తొమ్మిదో తేదీన ఉదయం 9 గంటలకు పట్టణంలోని రామకోటిపేట రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో వేడుకలు జరగనున్నాయి. వీటిని దత్తాత్రేయ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ప్రతినిధి రొప్పిచర్ల విజయసారధి ఓ ప్రకటనలో తెలిపారు. రాజరాజేశ్వరి అమ్మవారికి విశేషపూజలు నిర్వహించిన అనంతరం పండితులు అప్పాజ్యోస్యుల దక్షిణామూర్తి పంచాంగ శ్రవణ కార్యక్రమం ఉంటుందన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

భట్టిప్రోలు: డీఎడ్‌, బీఎడ్‌, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతకు వేసవి సెలవుల నేపథ్యంలో ప్రాథమిక తరగతుల బోధనలో మెళకువలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని భట్టిప్రోలు విశ్వశాంతి స్కూల్‌ కరస్పాండెంట్‌ ఎంపీ వెంకట్రావు తెలిపారు. మే ఒకటి నుంచి 15వ వరకు, జూన్‌ ఒకటి నుంచి పదో తేదీ వరకు ఉదయం 8:30 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ ఇస్తామని ఆయన చెప్పారు. ఔత్సాహికులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. భట్టిప్రోలు, రేపల్లె, చెరుకుపల్లి, కొల్లూరు, వేమూరు మండలాల యువతకు మాత్రమే ఈ అవకాశమని ఆయన వివరించారు.

25 మంది వలంటీర్ల రాజీనామా



కూచిపూడి(వేమూరు) అమర్తలూరు మండలం కూచిపూడికి చెందిన 25 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి తిరుపల రావుకు పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిన నాటి నుంచి ప్రతిపక్ష నాయకులు తమను అడుగడుగునా అవమానిస్తూనే ఉన్నారన్నారు. తాజాగా ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతూ..సేవల నుంచి తమను దూరంగా ఉంచేలా కుట్ర పన్నడం దారుణమని, ఇందుకు నిరసనగా తామంతా మూకుమ్మడి రాజీనామాలు చేసినట్లు వలంటీర్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి ఘటనలో నిందితుల అరెస్ట్‌

గుంటూరు రూరల్‌: ఇరువర్గాల మధ్య వివాదం నేపథ్యంలో ప్రత్యర్థిపై మద్యం సీసాలతో దాడిచేసిన వ్యక్తులను నల్లపాడు పోలీసులు అరెస్ట్‌ చేశారు. సీఐ నరేష్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి అమరావతిరోడ్డులోని ఒక బార్‌ అండ్‌ రెస్టారెంట్‌లో మద్యం సేవిస్తున్న మణికంఠస్వామి అనే వ్యక్తిని చిల్లర కిషోర్‌, విజయకిషోర్‌, పి.రమేష్‌, వెంకటేష్‌ అనే నలుగురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచిన సంఘటనలో బాధితుడు మణికంఠస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్‌ చేసినట్లు తెలిపారు.

కంటైనర్‌ లారీ ఢీకొని వ్యక్తి మృతి

గుంటూరు రూరల్‌: కంటైనర్‌ లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం నల్లపాడు పోలీసుస్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు బైపాస్‌ హైవేలో నగరానికి చెందిన చేరెడ్డి మోహనరావు(52) పూల వ్యాపారం చేస్తుంటాడు. ఆటోలో పూలబస్తాలను హైవే పక్కనే దించి ఫోన్‌ మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో చిలకలూరుపేట వైపు నుంచి వస్తున్న కంటైనర్‌ లారీ అదుపుతప్పి మోహనరావును ఢీకొంది. సంఘటనలో తీవ్రగాయాలతో మోహనరావు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన విషయం తెలుసుకున్న నల్లపాడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌ నిమిత్తం జీజీహెచ్‌ మార్చురీకి తరలించారు. సంఘటపై మృతుని కొడుకు రాజశేఖర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మొక్కజొన్న పరిశీలన

తాడేపల్లిరూరల్‌: దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెం, తుమ్మపూడి ప్రాంతాల్లో మొక్కజొన్న రైతులు ప్రైవేటు కంపెనీల విత్తనాలను కొనుగోలు చేసి మోసపోయిన విషయమై మార్చి 23న 'నట్టేట మునిగిన మొక్కజొన్న రైతు' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు శనివారం దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెం, తుమ్మపూడి గ్రామాల్లో నష్టపోయిన రైతులను పరామర్శించారు. లాంఫాంకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్‌ వై.సతీష్‌ కుమార్‌, డాక్టర్‌ పుష్పరేణి మైకో ఎంఆర్‌ఎం 4065 మొక్కజొన్న విత్తనాలు వాడిన పంట పొలాలను పరిశీలించారు. శాస్త్రవేత్త డాక్టర్‌ వై.సతీష్‌ మాట్లాడుతూ నష్టపోయిన మొక్కజొన్న రైతుల పొలాల నుంచి మొక్కజొన్న పొత్తులను సేకరించి దిగుబడిని కూడా పరిశీలిస్తున్నామని, విచారణ అనంతరం కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫ్యాన్‌ జోరు...ఫ్యాన్స్‌ హోరు

- వరికూటి అశోక్‌ బాబుకు అడుగడుగునా నీరాజనం,
- వేమూరులో ఊపందుకున్న అధికార పార్టీ ప్రచారం
- విజయంపై ధీమా వ్యక్తం చేస్తోన్న వరికూటి
- నాయకులు, కార్యకర్తలతో వడివడిగా ముందుకు సాగుతూ



కొల్లూరు ఇందిరానగర్‌-2 కాలనీలో ఇంటింటి ప్రచారంలో ఓటర్లను అభ్యర్థిస్తున్న వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు : ఓవైపు రెట్టించిన ఉత్సాహం.. మరోవైపు పార్టీకి వన్నెతగ్గని జనాదరణ.. ఇంకోవైపు అభిమానుల అండదండలు.. ఇవీ వేమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయ సంకేతాలు. ప్రచార పర్వం రోజురోజుకూ ఊపందుకుంటున్న వేళ, పెల్లుబికిన ఉత్సాహంతో ప్రజలు, పార్టీ శ్రేణుల హోరు నడుమ ప్రతిపక్షాలు ముక్కున వేలు వేసుకునేలా ప్రచారం తారస్థాయికి చేరుకుంది. వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు కొల్లూరులో నిర్వహించిన ఇంటింటి ఎన్నికల ప్రచారం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. గడప గడపకూ వెళ్లి ఆయన ప్రచారం నిర్వహించగా ప్రజల నుంచి సాదర స్వాగతం లభించింది. కొల్లూరు ఇందిరా నగర్‌ కాలనీ-2 నుంచి ప్రచారం ప్రారంభించిన ఆయన ఎస్సీ ఏరియా, టౌన్‌ చర్చి ప్రాంతాల్లో కలియ తిరిగారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలతో పాటు, సీఎం వైఎస్‌. జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తోన్న సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తీసుకువచ్చిన సమస్యలపై స్పందించారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో విజయం అందిస్తే ఒక్కో సమస్యను దశలవారీ ప్రాధాన్యపరంగా పరిష్కరిస్తానంటూ హామీ ఇచ్చారు. కొల్లూరు ఎస్సీ కాలనీ వాసుల స్మశాన వాటిక సమస్య, అంతర్గత రహదారులు, మురుగు నీటి పారుదల వ్యవస్థను మెరుగు పరుస్తానంటూ హామీ ఇచ్చారు. తమకు ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని కొందరు మహిళలు చెప్పడంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్‌ మోహన్‌ రెడ్డి ఇళ్ల స్థలాలు కేటాయిస్తారంటూ భరోసానిచ్చారు.



కొల్లూరు ఎస్సీ ఏరియా మహిళలతో సమస్యలపై చర్చిస్తున్న అశోక్‌బాబు

వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో తాము ఆర్థికంగా ఎంతో బలపడ్డామని, తామంతా అండగా నిలబడతామంటూ ప్రజలు అశోక్‌ బాబుకు ముక్త కంఠంతో మద్దతిస్తున్నారు.

వేమూరులో భారీ ఆధిక్యం ఖాయం

వేమూరు నియోజకవర్గంలో ప్రజలు తిరిగి వైఎస్సార్‌ సీపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని భారీ మెజారిటీతో తన విజయం ఖాయమని ని ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, సీఎం వైఎస్‌. జగన్‌మోహన్‌ రెడ్డి కులాలు, మతాలు, రాజకీయాలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. దీనికి ప్రతిఫలంగా ప్రజలు తమ గుండెల్లో జగన్‌ కు గుడి కట్టారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల దాష్టికాలు, నీరు-చెట్టు పేరుతో ప్రజాధనం దోపిడి, అవినీతే కనిపించిందని దీన్ని 2019లో ప్రజలు తిప్పికొట్టారన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చి తిరిగి ఓటేయమని అడిగేందుకు ప్రజల్లో ధైర్యంగా వెళ్లగలుగుతున్నామన్నారు. పేద వర్గాల మేలు కోసం తాపత్రయపడుతున్న సీఎం జగన్‌ పై కూటమి పార్టీలు కుట్ర పన్నుతున్నాయని ఆయన విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ విజయానికి ప్రతి పౌరుడూ క్యాంపెయినరు కావాలని అశోక్‌ బాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ సూర్యదేవర రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వేమూరు ఎంపీపీ యల్లమాటి మోహన్‌, వైస్‌ ఎంపీపీ మురాల రాంబాబు, జేసీఎస్‌ మండల కన్వీనర్‌ అయిల సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు బుల్లా నవరత్నం, అమిరిశెట్టి శ్రీధర్‌, బావిరెడ్డి వెంకట్రామయ్య, సర్పంచ్‌ సనక వెంకట్రావు, వేమూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌ బొల్లిముంత ఏడుకొండలు, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, వైఎస్సార్‌ సీపీ నాయకులు కూచిపూడి మోషే, ఆళ్లమూడి మధు, జ్యోతి, చిలకా ప్రకాశం, కనపర్తి రమేష్‌, కొల్లూరు శ్రీనివాసరావు, సింగం కృష్ణప్రసాద్‌, నర్ర బుల్లిబాబు, ఘంటా శివరంగారావు, గంగిరెడ్డి కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, పొలిమేర నవీన్‌రెడ్డి, ఎన్‌. కిరణ్‌, కనపర్తి మోహన్‌రావు, దున్న వెంకయ్య, మేకతోటి ఏలియ్య, పెదపూడి రత్తయ్య, దేవదాసు, గోపి, గరిక రమేష్‌, కూరేటి కోటేశ్వరరావు, గుర్రం వీరరాఘవయ్య, నూతలపాటి వెంకటేశ్వరరావు, చొప్పర నారయ్య, బిట్రగుంట సత్యనారాయణ, ఉప్పు సుబ్రమణ్యం, పరంద రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే



కర్లపాలెంలో నిర్వహించిన కవాతులో పోలీసులు, సాయుధ బలగాలు



పాతనందాయపాలెంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వివాదాస్పద వ్యక్తులకు కౌన్సిలింగ్‌ ఇస్తున్న పోలీసులు

బాపట్ల టౌన్‌: గత ఎన్నికల్లో అల్లర్లు సృష్టించిన వ్యక్తులపై పోలీసులు నిఘా పెట్టారు. వారి ఇళ్లకు వెళ్ళి ప్రవర్తన మార్చుకోవాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఇందులో భాగంగా చుండూరు, కర్లపాలెం పోలీస్‌ అధికారులు, సాయుధ బలగాలతో సమస్యాత్మక గ్రామాల్లో కవాతు, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా, సత్ప్రవర్తనతో మెలగాలని వివాదాస్పదులకు కౌన్సిలింగ్‌ నిర్వహిస్తున్నారు. సమస్యలను సృష్టించేవారి కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని వారు హెచ్చరించారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

కర్లపాలెం: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పాతనందాయ పాలెం, కర్లపాలెం, గణపవరం, బుద్దాం గ్రామాల్లో పోలీసులు, సరిహద్దు భద్రతా బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్‌ఐ జనార్దన్‌ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు.

'పది' మూల్యాంకన కేంద్రం పరిశీలన

పెదకాకాని: పెదకాకాని రోడ్డులోని సెయింట్‌ జోసెఫ్‌ సీబీఎస్‌ఈ స్కూలు నందు నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని శనివారం ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌ డి.దేవానంద రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో పరీక్షా పత్రాల మూల్యాంకనం జరుగుతున్న తీరును పరిశీలించి, ఉపాధ్యాయులను కలిసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ డి.దేవానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులు ఏ విధమైన పొరపాట్లకు అవకాశం లేకుండా మూల్యాంకన ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. మూల్యాంకన కేంద్రంలో కల్పించిన ఏర్పాట్లపై జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్‌ కమిషనర్‌ కె.వెంకట్‌రెడ్డి లను అభినందించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఉప విద్యాశాఖాధికారి బలిరాం, సీనియర్‌ ప్రధానోపాధ్యాయులు తిరుమలేష్‌, ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

గుంటూరు రూరల్‌: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించటంతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని ఏపీ రైతు సాధికారసంస్థ ఎన్‌ఎఫ్‌ఏ ఉమాదేవి తెలిపారు. శనివారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో రైతు వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో నవధాన్యాలు పండిస్తున్న రైతులు, సేంద్రియ వ్యవసాయ చేస్తున్న రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఆశయంతో రాష్ట్రప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం పేరుతో రైతు సాధికార సంస్థ ద్వారా ఒక వినూత్న పథకాన్ని రూపొందించడం జరిగిందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించే ఈ లాభసాటి వ్యవసాయం భూసార పరిరక్షణకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. వర్షాభావ పరిస్థితులను, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోగల శక్తి ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమని చెప్పారు. విష రసాయన రహిత ఆహార ఉత్పత్తులను సమాజానికి అందించవచ్చన్నారు. గత రెండేళ్లగా ప్రకృతి వ్యవసాయ విధానం అవలంభిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి కావలసిన ఆవు పేడ, ఆవు మూత్రంతో తయారయ్యే ఉత్పత్తులు, ఇతర వస్తువులు సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి రైతులచేత నడిపించే షాప్‌లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.

ఓటు విలువ గుర్తించాలి

ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి షారోన్‌

రేపల్లె రూరల్‌: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి, ఆర్డీవో హెలా షారోన్‌ ప్రజలను కోరారు. మండలంలోని పెనుమూడిలో సఖి ఆదర్శ పోలింగ్‌ కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి పథంలో నడిపించే, నిస్వార్థంగా పని చేసే నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటే సరైన ఆయుధమన్నారు. ప్రలోభాలు, బంధుప్రీతి, ప్రాంతీయతత్వానికి లోనుకాకుండా వజ్రాయుధం లాంటి ఓటు హక్కును సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ చొప్పా రవీంద్ర, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పెనుమూడిలో నిర్వహించిన ర్యాలీలో రిటర్నింగ్‌ అధికారి షారోన్‌, రెవిన్యూ సిబ్బంది

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి కోన రఘుపతి తనయుడు నిఖిల్‌

పిట్టలవానిపాలెం : బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్‌ భవనంవారిపాలెం సచివాలయ పరిధిలోని చోడిపాలెం,ఎస్సీ కాలనీలలో రెండోరోజు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమాభివృద్ధి కొనసాగుతుందన్నారు. బాపట్ల శాసన సభ్యునిగా కోన రఘుపతిని మూడోసారి నిండుమనసుతో ఆశీర్వదించాలని కోరారు. బాపట్ల అభివృద్ధి, వైద్య కళాశాల నిర్మాణంతో పాటు జిల్లా మరింత ముందుకు వెళ్ళాలంటే కోన రఘుపతికి మరోసారి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 19 న బాపట్ల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన తండ్రి నామినేషన్‌ వేస్తారని, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని నిఖిల్‌ ఆహ్వానించారు. ఆయన వెంట వైఎస్సార్‌ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, మండల కన్వీనర్‌ ఉయ్యూరి లీలా శ్రీనివాస రెడ్డి, వైస్‌ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సింధు, గ్రామ ఉపసర్పంచ్‌ బడుగు మాధవి,మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కోటిరెడ్డి,కుంచం సన్నరాజు, మంతెన వారిపాలెం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌ అక్కల మురళీ సముద్రాలరెడ్డి, మండే విజయ్‌ కుమార్‌, బడుగు ప్రకాశరావు, సుబ్రమణ్యం రెడ్డి, శ్యామల నాగిరెడ్డి, బొలగాని సుబ్బారావు, సురేశ్‌ బాబు, గుమ్మడి సీతయ్య తదితరులు ఉన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోన నిఖిల్‌

కోడ్‌ కూస్తోంది.. మీకు వినిపించట్లేదా?



భట్టిప్రోలు విఠలేశ్వరనగర్‌లో రామ మందిరం ఎదురుగా ఉన్న శిలాఫలకం



కొత్త విఠలేశ్వరనగర్‌లో మూసివేయకుండా ఉన్న శిలాఫలకం

శిలాఫలకాలకు ముసుగు వేయని అధికారులు

భట్టిప్రోలు: ఓ పక్క ఎన్నికల ప్రవర్తనా నియమావళి దేశవ్యాప్తంగా కోడై కూస్తోంటే..భట్టిప్రోలు పంచాయతీలో అందుకు విరుద్ధంగా పరిస్థితి కనిపిస్తోంది. స్థానిక సామాజిక భవనాల శిలాఫలకాలను అలాగే వదిలేశారు. వీటికి స్టిక్కర్లు వేయడం మరిచారు. శిలాఫలకంపై అప్పటి కాంగ్రెస్‌ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధుల పేర్లు కొట్టొచ్చినట్లు కనిపిస్తూనే ఉన్నాయి. అలాగే కొత్త విఠలేశ్వరనగర్‌లోని శిలాఫలకానికి ఎలాంటి ముసుగూ వేయలేదు. కోడ్‌ అమల్లోకి వచ్చి మూడువారాలు కావస్తున్నా ఏమీ పట్టనట్లు కనిపిస్తోంది ఇక్కడి పరిస్థితి. విగ్రహాలను పట్టాలతో కప్పిన అధికారులు చెంతనే ఉన్న శిలాఫలకాలను ఎందుకిలా వదిలేశారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సంక్షేమ పథకాలందాలంటే జగనే సీఎం కావాలి

ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందాలంటే జగనే సీఎం కావాలని ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కోన రఘుపతి అన్నారు. శనివారం రాత్రి దమ్మన వారిపాలెం, బుద్దాం, పెదగొల్లపాలెంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ సీఎం జగన్‌ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందని చెప్పిన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, ఇప్పుడు జగన్‌ అమలు చేస్తున్న పథకాల కంటే ఎక్కువ అమలు చేస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత జగన్‌ కే దక్కుతుందన్నారు.

నామినేషన్‌ కు ఆశీర్వదించండి

ఈనెల 19న బాపట్ల అసెంబ్లీకి వైఎస్సార్‌ సీపీ బలపరిచిన అభ్యర్థిగా నామినేషన్‌ వేయబోతున్నానని, ప్రజలంతా వచ్చి తనను బలపరిచి మద్దతు తెలపాలని కోన రఘుపతి కోరారు. పెదగొల్లపాలెం పంచాయతీ పరిధి గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, వైస్‌ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, సర్పంచ్‌లు యల్లావుల సురేశ్‌, అక్కల శ్రీనివాసరెడ్డి, దేవరకొండ అంకమ్మ, ఎంపీటీసీలు ఆసిఫ్‌ అలీ, అమీర్‌బేగ్‌, గొర్ల కమల, పార్టీ నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, యారం ఇసాక్‌, చీరాల సత్యనారాయణరెడ్డి, కాగిత ఆనందరావు, కేసాని వరప్రసాద్‌, గొర్ల సుబ్బారావు, కాకర్లపూడి హరిరాజు, అజీంఖాన్‌, యల్లావుల గిరి, ఆమోస్‌, మరకా పెద్దబ్బాయి, జయభారత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పెదగొల్లపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

జగనన్న పాలనలో.. సుభిక్షం, సస్యశ్యామలం

తురిమెళ్ల(వేమూరు) జగనన్న పాలన..సుభిక్షం, సస్యశ్యామలానికి సంకేతమని , ఆయన పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారని నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు తనయుడు తేజ అభివర్ణించారు. అమర్తలూరు మండలం తురిమెళ్ల గ్రామంలో శనివారం ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డిని మళ్లీ ముఖ్య మంత్రిని చేసేందుకు మనస్ఫూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. వైఎస్సార్‌సీపీ తరఫున బాపట్ల పార్లమెంట్‌, వేమూరు నియోజక వర్గనికి పోటీ చేస్తున్న నందిగం సురేశ్‌, వరికూటి అశోక్‌బాబు విజయానికై ప్రతి ఒక్కరూ సహకరించలని ఆయన అభ్యర్థించారు. వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయితే జన సంక్షేమంలో కొత్త ఒరవడి చోటుచేసుకుంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో కోళ్లమూడి అశోక్‌, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



తురిమెళ్లలో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేస్తోన్న వరికూటి అశోక్‌ బాబు తనయుడు తేజ

సీఎం జగన్‌ హయాంలో అతివలకు అగ్రస్థానం

- ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి
- వెల్లటూరులో ఎన్నికల ప్రచారం

భట్టిప్రోలు: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అతివలకు అగ్రస్థానం లభించిందని వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌ బాబు సతీమణి లక్ష్మి అన్నారు. శనివారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులో పార్టీ శ్రేణులతో కలసి ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అవినీతి రహిత పాలనతో పాటు అర్హులందరికి సంక్షేమ లబ్ధి చేకూర్చిన సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా వరికూటి అశోక్‌బాబును, ఎంపీగా నందిగం సురేశ్‌ లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌ చౌటూరి లక్ష్మి, దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్‌ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, పార్టీ మండల కన్వీనర్‌ మోర్ల శ్రీనివాసరావు(నాని), ఎంపీటీసీ సభ్యులు కొతరపు పద్మావతి, దారావత్‌ కుమారి బాయి, గోవర్ధనగిరి చినబుజ్జి, వైఎస్సార్‌ సీపీ వివిధ విభాగాల నాయకులు చౌటూరి రవీంద్ర, గురిందపల్లి సునీల్‌, కృష్ణనాయక్‌,శివమణి, శంకర్‌, బుజ్జి నాయక్‌, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



వెల్లటూరు ఎన్నికల ప్రచారంలో వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి

ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్‌: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నాదెండ్ల రామారావు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో బెంగళూరుకు చెందిన మెడిఅసిస్ట్‌ ఇన్సూరెన్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. సంస్థ వారితో ఏడాదికి రూ 2.6 లక్షల వేతనం అందించేందుకు ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఉద్యోగాలను సాధించిన విద్యార్థులను చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అభినందించారు.

క్రోధి నామ సాహితీ వసంతోత్సవానికి సన్నద్ధం

- 27వ వసంతంలోకి సాహితీ సమాఖ్య
- ఉగాది నాడు విజ్ఞాన మందిరం వేదికగా సాహితీ వసంతోత్సవం

పాత గుంటూరు: సాహిత్యంతో సమాజంలో ఎంతటి మార్పునైనా తీసుకురాగలమనే లక్ష్యంతో నగరంలో సాహితీ సమాఖ్య సంస్థ స్థాపించబడింది. 1997లో సాహిత్యాభిమాని ఎస్వీఎస్‌ లక్ష్మీనారాయణ వ్యవస్థాపక కార్యదర్శిగా మిత్ర బృందంతో కలిసి నెలకొల్పారు. ప్రతి ఏడాది ఉగాది రోజున 'సాహితీ వసంతోత్సవం' పేరుతో విశేష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గత 26 ఏళ్లుగా వివిధ రాష్ట్రాల్లో తెలుగు సాహిత్యంలో విశేష ప్రతిభ కలిగిన ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేస్తూ సత్కరిస్తున్నారు. ఇప్పటి వరకు 270 మందికి పైగా సుప్రసిద్ధ కవులు, కవయిత్రులు, కార్టూనిస్టులు, గురుస్వాములు, యువ కవులకు పురస్కారాలు అందించారు. సినీ ప్రముఖులు కె. విశ్వనాథ్‌, గుమ్మడి వెంకటేశ్వరరావు, గొల్లపూడి మారుతీరావు, సింగీతం శ్రీనివాసరావు, చంద్రబోస్‌, సిరివెన్నెల సీతారామశాస్త్రి, అనంత శ్రీరామ్‌, వేటూరి సుందరరామ్మూర్తి, మాడుగుల నాగఫణిశర్మ, గరికపాటి నరసింహారావు, పాపినేని శివశంకర్‌, వాడ్రేవు చిన వీరభద్రుడు, కొలకలూరి ఇనాక్‌, గోరటి వెంకన్న, అందెశ్రీ , వరంగల్‌ శ్రీనివాస్‌... ఇలా ఎంతోమందికి ఈ పురస్కారాలు వరించాయి.

సభా ప్రాంగణం ముస్తాబు

గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా సాహితీ సమాఖ్య ఉగాది పండుగ రోజు సాయంత్రం ఐదు గంటల నుంచి సాహితీ వసంతోత్సవ సభను నిర్వహిస్తుంది. పండుగకు ప్రతీకగా ప్రాంగణాన్ని, వేదికను తీర్చిదిద్దుతారు. సభకు వచ్చే అతిథులంతా సంప్రదాయ దుస్తులతో హాజరు కావడం ఆనవాయితీగా వస్తోంది. పంచాంగ పఠనం తర్వాత సాహితీ సమ్మేళనం, అతిథుల ఉపన్యాసాలు, పుస్తకావిష్కరణలు, పురస్కార ప్రదానాలు, కవితా ప్రదర్శనలు రాత్రి పది గంటల వరకూ కొనసాగుతాయి.

అందరూ ఆహ్వానితులే..

సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్‌ లక్ష్మీనారాయణ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాహితీ సమాఖ్య, ఠాగూర్‌ మెమోరియల్‌ థియేటర్‌ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో క్రోధినామ సంవత్సరాన్ని పురస్కరించుకుని 27 వసంతాల సాహితీ వసంతోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొనాలని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో విష్ణు సహస్రనామ పారాయణ, నాదస్వర కచేరి, వేద పఠనం, పంచాంగ శ్రవణం జరుగుతుందని పేర్కొన్నారు.